క్లుప్తంగా

ఆటో కార్మికులను ఆదుకోవాలి



నిరసన తెలియజేస్తున్న ఆటో కార్మికులు

గంట్యాడ: స్త్రీ శక్తి పథకం వల్ల ఉపాధి కోల్పోయిన ఆటోకార్మికులను ఆదుకోవాలని దళిత హక్కుల పోరాట సమితి జిల్లా కార్యదర్శి రేగిటి సంతోష్ కోరారు. ఈ మేరకు మండలంలోని కొండతామరపల్లి జంక్షన్‌లోని ఆటోస్టాండ్ వద్ద శనివారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆటో కార్మికులకు నెలకు రూ. 5 వేలు చొప్పున జీవన భృతి ఇవ్వాలన్నారు. వాహనమిత్ర పథకంలో భాగంగా ఇస్తామన్న రూ.15 వేలు వెంటనే మంజూరు చేసి ఆదుకోవాలని కోరారు.

ప్రత్యేక అలంకరణలో వేణుగోపాలస్వామి



పూజలందుకుంటున్న వేణుగోపాలస్వామి

జామి: మండలంలోని అన్నంరాజుపేట పంచాయతీ పుష్పగిరి వేణుగోపాలస్వామి ఆలయంలో శనివారం సందర్భంగా స్వామివారిని తులసీదళాలలతో అలంకరించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. అలాగే భీమసింగి సుగర్‌ఫ్యాక్టరీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో కూడా ప్రత్యేక పూజలు చేశారు.

ఘనంగా హిందీ దివస్



హిందీ గొప్పతనం చాటుతూ విద్యార్థినుల నృత్యరూపకం

శృంగవరపుకోట: మండలంలో భవానీనగర్‌లో గల డీవీఎల్ పబ్లిక్ స్కూల్‌లో హిందీ దివస్ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. బహుభాషా కోవిదుడు రాజేంద్ర సింహా జన్మదినాన్ని పురస్కరించుకుని హిందీ దివస్ నిర్వహించారు. ఈ సందర్భంగా హిందీ భాష గొప్పతనాన్ని వక్తలు వివరించారు. పాఠశాల ప్రిన్సిపాల వై.జానకీదేవి మాట్లాడుతూ.. భారతదేశాన్ని కలిపి ఉంచేది హిందే భాషేనని చెప్పారు. హిందీ నేర్చుకోవడం ద్వారా భవిష్యత్‌ను ఉన్నతంగా తీర్చిదిద్దుకోవచ్చన్నారు. కార్యక్రమంలో పాఠశాల అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పిచ్చి మొక్కలు తొలగించరూ..



కార్యాలయం ఆవరణలో పేరుకుపోయిన పిచ్చిమొక్కలు

గజపతినగరం: మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం ఆవరణ చుట్టూ పిచ్చి మొక్కలు, తుప్పలు ఏపుగా పేరుకుపోయాయి. దీంతో కార్యాలయానికి వచ్చే ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పరిసరాల పరిశుభ్రత, చెత్త సేకరణపై నిత్యం అధికారులు ఊకదంపుడు ఉపన్యాసాలు చెబుతారే తప్ప.. తమ కార్యాలయం పరిసరాలు ఎలా ఉన్నాయో చూడకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పిచ్చి మొక్కల వల్ల విషసర్పాలు సంచరించే అవకాశం ఉందని.. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి జంగిల్ క్లియరెన్స్ చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

మత విద్వేషాలు వద్దు..

- చీపురుపల్లి డీఎస్పీ రాఘవులు



మాట్లాడుతున్న చీపురుపల్లి డీఎస్పీ ఎస్.రాఘవులు

మెరకముడిదాం: హిందువులు, క్రైస్తవులు మత విద్వేషాలకు పోకుండా సోదరభావంతో కలిసి మెలిసి ఉండాలని చీపురుపల్లి డీఎస్పీ ఎస్.రాఘవులు సూచించారు. బుధరాయవలస పోలీస్‌స్టేషన్‌లో మండలంలోని పలు గ్రామాలకు చెందిన గ్రామ పెద్దలు, అలాగే హిందువులు, క్రైస్తవ పెద్దలతో శనివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎవరి మతాలను వారు గౌరవించుకుంటూ.. ఎదుటవారిని కూడా సోదరభావంతో చూడాలన్నారు. ప్రార్థనా స్థలాల వద్ద అధిక శబ్దం వచ్చే మైక్‌సెట్‌లు వినియోగించరాదని సూచించారు. కార్యక్రమంలో చీపురుపల్లి సీఐ శంకరరావు, బుధరాయవలస ఎస్సై జె.లోకేష్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

16న ఉపాధి పనులపై బహిరంగ సభ

కొత్తవలస: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో భాగంగా 2024 – 25 ఆర్థిక సంవత్సరంలో నిర్వహించిన పనులపై సామాజిక తనిఖీ నిర్వహించినట్లు ఎంపీడీఓ శ్రీదేవి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కాగా ఈ పనులపై 16వ తేదీన స్థానిక మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో బహిరంగ సభ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

నాణ్యత ప్రశ్నార్థకం..
సౌకర్యాలు శూన్యం



తరచూ వివాదాలు జరుగుతున్న మెయిన్‌రోడ్‌లోని హెచ్‌పీ పెట్రోల్ బంక్ ఇదే..

- పెట్రోల్, డీజిల్ కల్తీపై ఆరోపణలు
- హెచ్‌పీ పెట్రోల్ బంక్‌లో ఎప్పటికప్పుడు వివాదాలు
- వాహనాలు పాడైపోతున్నాయంటున్న వినియోగదారులు
- చూసీచూడనట్లు వదిలేస్తున్న యంత్రాంగం

చీపురుపల్లి: ప్రతి ఒక్కరూ నిత్యవసరంగా భావించే పెట్రోల్, డీజిల్‌లో నాణ్యత కొరవడుతోంది. రోజురోజుకీ పెట్రోల్, డీజిల్ ధరలు మాత్రం పెరిగిపోతున్నాయి. ఈ నేపథ్యంలో అధిక ధరలు వెచ్చించి కొనుగోలు చేసుకుంటున్నప్పటికీ అందులో నాణ్యత లేకపోతే పరిస్థితి ఏమిటని వాహనదారులు ప్రశ్నిస్తున్నారు. వాహనాలు పాడైతే ఎవరు బాధ్యత వహిస్తారు.. చర్యలు తీసుకోవాల్సిన యంత్రాంగం చూసీచూడనట్లు వదిలేస్తుంటే ఎవరికి చెప్పుకోవాలని వాహనదారులు వాపోతున్నారు. పట్టణంలోని మెయిన్‌రోడ్‌లో బీఆర్.అంబేడ్కర్ గురుకుల కళాశాల ఎదురుగా ఉన్న హెచ్‌పీ పెట్రోల్ బంక్‌లో ఎప్పటికప్పుడు వివాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఈ బంక్‌లో నాణ్యత ప్రశ్నార్థకం కాగా సౌకర్యాలు సైతం శూన్యంగానే ఉన్నాయి. ఓ వైపు నాణ్యత లోపం.. మరోవైపు సౌకర్యాలు లేకపోయినప్పటికీ పట్టించుకునే వారే లేకపోవడం గమనార్హం. ఎప్పటికప్పుడు వినియోగదారులు ఈ బంక్ వద్ద ఆందోళనలు చేపడుతుండడం విశేషం.

కనీస సౌకర్యాలు శూన్యం..

పెట్రోల్ బంక్‌లో నిబంధనలు ప్రకారం ఫ్రీ ఎయిర్, తాగునీటి సదుపాయం, మరుగుదొడ్లు, ఫిర్యాదులు/సలహాల పెట్టె, ఆయిల్ కంపెనీ నంబర్లు, తదితర సదుపాయాలు ఉండాలి. అయితే పట్టణంలోని హెచ్‌పీ పెట్రోల్ బంక్‌లో పైన తెలిపిన ఒక్క సౌకర్యం కూడా లేదు. వాహనాలకు అత్యవసరమైన గాలి పెట్టే సదుపాయం కూడా లేదు. వినియోగదారులు ఫిర్యాదులు చేయాల్సిన ఆవశ్యకత ఏర్పడితే సంబంధిత ఆయిల్ కంపెనీ నంబర్లకు ఫోన్ చేసినా అటు నుంచి ఎలాంటి స్పందన ఉండదని వినియోగదారులు చెబుతున్నారు.

తరచూ వివాదాలు..

పట్టణంలోని మెయిన్‌రోడ్‌లో ఉన్న హెచ్‌పీ పెట్రోల్ బంక్‌లో నిరంతరం వివాదాలు జరుగుతూనే ఉంటాయి. తాజాగా ఈ నెల 11న పట్టణానికి చెందిన తమ్మిన వెంకటేష్ అనే వ్యక్తి తన ద్విచక్ర వాహనంలో రూ.510 పెట్రోల్ పోయించుకుని కొద్ది దూరం వెళ్లే సరికి వాహనం ఆగిపోయింది. దీంతో పెట్రోల్ బంక్‌కు తిరిగి వచ్చి వాహనంలో ఉన్న పెట్రోల్‌ను ఓ బాటిల్‌లోకి తీసి చూడగా అందులో సగం నీరు ఉండడం గమనార్హం. ఇదే కాదు గతంలో కూడా చాలా సార్లు ఇదే పరిస్థితి ఎంతో మంది వాహనదారులకు ఎదురైంది. దీనిపై తహసీల్దార్ ధర్మరాజు నేతృత్వంలో అధికారులు పెట్రోల్ బంక్‌కు విచారణకు వచ్చినప్పటికీ ఎలాంటి తేడాలు లేవని తేల్చి చెప్పడం కొసమెరుపు.

మైలేజీ రావట్లేదు..

హెచ్‌పీ బంక్‌లో ఆయిల్ కొడితే మైలేజీ రావట్లేదు. ఆయిల్ కూడా కలర్ కూడా నీరులాగే కనిపిస్తోంది. వేరే బంక్‌లో ఆయిల్ కొడితే మంచి మైలేజ్ వస్తోంది. ఆటో ఇంజిన్‌లో ఎప్పటికప్పుడు సమస్యలు వస్తున్నాయి. నేను చాలా సార్లు కల్తీ ఆయిల్‌తో ఇబ్బంది పడ్డాను.

– కిశోర్, ఆటో డ్రైవర్, చీపురుపల్లి

వాహనం పాడైంది..

నేను ఎప్పటికప్పుడు ఈ బంక్‌లో ఆయిల్ కొడుతుంటాను. వాహనం తరచూ పాడవుతోంది. మొదట్లో పెద్దగా పట్టించుకోలేదు. ఇటీవల కాలంలో ఈ బంక్ వద్ద వివాదాలు ఎక్కువగా చోటుచేసుకుంటున్నాయి. దీంతో అప్రమత్తమై పరిశీలించగా.. పెట్రోల్‌లో నాణ్యత లోపించినట్లు గుర్తించాను. అప్పటి నుంచి వేరే బంక్‌లో ఆయిల్ కొనుగోలు చేస్తున్నాను.

– బాలరాజు, ద్విచక్ర వాహనదారుడు, చీపురుపల్లి

పోలీసుల సమక్షంలో యూరియా పంపిణీ



కె. కొత్తవలస రైతుసేవా కేంద్రం వద్ద పోలీసుల సమక్షంలో స్లిప్పుల పంపిణీ

దత్తిరాజేరు: కూటమి ప్రభుత్వంలో రైతులకు యూరియా కష్టాలు వీడడం లేదు. యూరియా కోసం ఇబ్బందులు పడుతున్న తరుణంలో కె. కొత్తవలస రైతుసేవా కేంద్రం వద్ద పోలీసుల సమక్షంలో శనివారం యూరియా పంపిణీ చేశారు. ఒక్కొక్కరికీ ఒక్కో బస్తా చొప్పున అందజేశారు. గత వైఎస్సార్‌సీపీ హయాంలో లేని ఇబ్బందులు ఇప్పుడెందుకు వచ్చాయో అర్థం కావడం లేదని అన్నదాతలు వాపోయారు.

నిలిచిన యూరియా పంపిణీ..

మండలంలోని ఇంగిలాపల్లి రైతుసేవా కేంద్రం వద్ద యూరియా నిల్వలు లేకపోవడంతో శనివారం సరఫరా నిలిపివేశారు. పెదమానాపురం పోలీసుల సమక్షంలో ఉదయం నుంచి స్లిప్పులు పంపిణీ చేసినా యూరియా మాత్రం ఇవ్వలేకపోయారు. రైతులందరికీ సరిపడా ఎరువు లేదని, రెండు రోజుల్లో సరుకు తెప్పించి ఇస్తామని వ్యవసాయ సిబ్బంది తెలిపారు. కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి రైతులకు పాట్లు తప్పడం లేదని రైతులు గర్బాపు శ్రీను, కొల్లి తిరుపతి, రామకృష్ణ, తదితరులు ఆవేదన వ్యక్తం చేశారు.

చెడు వ్యసనాలకు దూరం



మాట్లాడుతున్న ఆంధ్రా యూనివర్సిటీ మాజీ డీన్ చంద్రమౌళి

- ఏయూ మాజీ డీన్ కెంబూరి చంద్రమౌళి

కొత్తవలస: విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ జీవితానికి అద్భుతమైన బాటలు వేసుకోవాలని ఆంధ్రా యూనివర్సిటీ మాజీ డీన్ కెంబూరి చంద్రమౌళి సూచించారు. మండలంలోని తుమ్మికాపల్లి గేట్ సమీపంలో గల వాగ్దేవి కళాశాలలో శనివారం ఫ్రెషర్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు సమయాన్ని వృథా చేసుకోకూండా భవిష్యత్‌పై దృష్టి సారించాలన్నారు. అనంతరం కళాశాల కరస్పాండెంట్ కె.మహేశ్వరరావు, డైరెక్టర్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ.. విద్యార్థులు సమయపాలన పాటిస్తూ అందొచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అంతకుముందు విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో పలువురు బోధనా సిబ్బంది పాల్గొన్నారు.

అమరావతిలో ఆందోళన చేస్తాం..



జిందాల్ నిర్వాసితులతో కలిసి మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రఘురాజు

- జిందాల్ నిర్వాసితులు

శృంగవరపుకోట: జిందాల్ నిర్వాసితుల గోడును గల్లీ నుంచి ఢిల్లీ వరకు వినిపించామని.. త్వరలో చలో అమరావతి కార్యక్రమం నిర్వహించి అక్కడ నిర్వాసితుల గళం వినిపిస్తామని ఎమ్మెల్సీ రఘురాజు తెలిపారు. బొడ్డవరలోని తన స్వగృహంలో నిర్వాసితులు, రైతు సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు చల్లా జగన్, తదితరులతో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. ఢిల్లీలో ఆందోళన చేపట్టినప్పుడు పెద్దలు, పోలీసులు నిర్వాసితుల సమస్యలు అడిగి తెలుసుకున్నారన్నారు. నిర్వాసితుల గోడు ప్రభుత్వానికి తెలియజేసేలా త్వరలో వెయ్యి మంది నిర్వాసిత కుటుంబాలతో చలో అమరావతి కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఇదిలా ఉంటే జిందాల్ నిర్వాసితులున్న పంచాయతీల్లో కార్యదర్శులను అడ్డగోలుగా డిప్యుటేషన్లపై పంపిస్తున్నారని ఆరోపించారు. రికార్డులు మార్చేసి, తప్పుడు రిపోర్టులు తయారీయే లక్ష్యంగా ఈ బదిలీలకు పాల్పడ్డారని మండిపడ్డారు. నిర్వాసితుల భూములు వారికే అప్పగించాలన్నారు. నిర్వాసితులకు న్యాయం జరగకపోతే ఆందోళనను ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు.

17 నుంచి విశ్వకర్మ జయంతి ఉత్సవాలు



ఉత్సవాల కరపత్రాలు విడుదల చేస్తున్న విశ్వబ్రాహ్మణ సంఘ ప్రతినిధులు

చీపురుపల్లి: ఈ నెల 17 నుంచి 22 తేదీ వరకు విశ్వకర్మ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు విశ్వబ్రాహ్మణ సంఘ మండల అధ్యక్షుడు మారోజు చక్రధర్ తెలిపారు. పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయం వద్ద శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఉత్సవాలకు సంబంధించిన కరపత్రాలను సంఘ సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టణంలోని హడ్కోకాలనీలో గల శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో జయంతి ఉత్సవాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో సంఘ ప్రధాన కార్యదర్శి పట్నాన ఈశ్వరరావు, ఉపాధ్యక్షుడు సర్వశెట్టి భాస్కరరావు, జిల్లా స్వర్ణకారుల సంఘ ఉపాధ్యక్షుడు కొచ్చెర్ల రామకృష్ణ, సంఘ సభ్యులు టి.సత్యనారాయణ, కె.సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద గర్భిణికి ఆర్థిక సాయం



గరివిడి: గర్భిణికి ఆర్థిక సాయం చేస్తున్న అభయాంజనేయ యూత్ ప్రతినిధులు

చీపురుపల్లి రూరల్ (గరివిడి): గరివిడి మండలంలోని చుక్కవలస గ్రామానికి చెందిన కొవ్వాడ రాము అనే గర్భిణికి అదే గ్రామానికి చెందిన అభయాంజనేయ యూత్ సభ్యులు రూ. 35 వేల నగదు, రెండు నెలలకు సరిపడా నిత్యావసర సరుకులు శనివారం వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా యూత్ సభ్యులు మాట్లాడుతూ.. అవకాశం ఉన్నంత వరకు సేవా కార్యక్రమాలు చేపడతామని చెప్పారు.

ఆర్థిక సాయం

గుర్ల: స్నేహితురాలి కుటుంబాన్ని ఆదుకోవడానికి కెల్ల హైస్కూల్‌లో 2007లో చదువుకున్న పూర్వ విద్యార్థులు ముందుకు వచ్చారు. కెల్లకు చెందిన బొప్పడాపు సంతోషి తల్లి బొప్పడాపు అప్పయ్యమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న తోటి స్నేహితులు సంతోషికి శనివారం ఆర్థిక సాయం చేశారు. కార్యక్రమంలో కెల్ల సురేష్, కె. చంద్రరావు, జగదీష్ పాల్గొన్నారు.

శ్రీరాములునాయుడు సేవలు చిరస్మరణీయం

- ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కళా వెంకటరావు

మెరకముడిదాం: జర్మనీలో స్థిరపడినప్పటికీ తన సొంత గ్రామానికి మంత్రి శ్రీరాములు అందించిన సేవలు చిరస్మరణీయమని చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు కొనియాడారు. మండలంలోని పెదమంత్రిపేట గ్రామంలో స్వర్గీయ శ్రీరాములునాయుడు జయంతి వేడుకలను రిటైర్డ్ అధ్యాపకుడు హరశ్రీరాములు ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతంలో పుట్టి జర్మనీ వెళ్లి అక్కడ స్థిరపడిన మంత్రి శ్రీరాములునాయుడు తన స్వస్థలమైన మంత్రిపేటను మరిచి పోలేదన్నారు. ఎంతోమంది యువత చదువుకు సహాయపడ్డారన్నారు.అటువంటి వ్యక్తి జయంతి జరుపుకోవడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు తాడ్డి సన్యాసినాయుడు, కోట్ల మోతీలాల్‌నాయుడు, కళాశాలల అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

రాజీయే రాజమార్గం



గజపతినగరం రూరల్: మాట్లాడుతున్న ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ విజయరాజ్‌కుమార్

- ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ విజయరాజ్‌కుమార్

గజపతినగరం రూరల్: కక్షిదారులు తమ విలువైన సమయాన్ని కోర్టుల చుట్టూ తిరిగి వృథా చేసుకోకుండా రాజీ ద్వారా సమస్యలను పరిష్కరించుకోవాలని స్థానిక జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ విజయరాజ్ కుమార్ అన్నారు. శనివారం నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్‌లో ఆయన పాల్గొని.. 577 కేసులను రాజీ ద్వారా పరిష్కరించారు. కార్యక్రమంలో సభ్యులుగా జెర్రిపోతుల జగదీష్ ,రెడ్డి శ్రీనివాసులనాయుడు, న్యాయవాదులు పాల్గొన్నారు.

337 కేసుల పరిష్కారం..

శృంగవరపుకోట: పట్టణంలోని మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టులో జూనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయ సేవా కమిటీ చైర్‌పర్సన్ బి.కనకలక్ష్మి, అధ్యక్షతన నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్ కార్యక్రమంలో 337 కేసులు పరిష్కరించినట్లు కోర్టు వర్గాలు తెలిపాయి. వీటిలో 324 క్రిమినల్ కేసులు, 2 సివిల్ కేసులు, 9 చెక్‌బౌన్స్ కేసులు, 2 మనోవర్తి కేసులు పరిష్కారమయ్యాయి. అలాగే న్యాయమూర్తి అప్పలనాయుడు నేతృత్వంలో డ్రంక్ అండ్ డ్రైవ్, ఓపెన్ డ్రింకింగ్, న్యూసెన్స్ కేసులను కూడా పరిష్కరించారు. కార్యక్రమంలో పలువురు సీనియర్ న్యాయవాదులు, కక్షిదారులు, బ్యాంకర్లు, పోలీస్, ప్రొహిబిషన్ ఎండ్ ఎక్సైజ్ శాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.



శృంగవరపుకోట: లోక్‌అదాలత్‌లో విచారణ నిర్వహిస్తున్న న్యాయమూర్తి కనకలక్ష్మి



చీపురుపల్లి: మాట్లాడుతున్న మెజిస్ట్రేట్ బుజ్జి

223 కేసుల రాజీ..

కొత్తవలస: మండలంలోని జూనియర్ సివిల్ కోర్టు ప్రాంగణంలో జాతీయ మెగా లోక్‌అదాలత్‌ను జూనియర్ సివిల్ జడ్జి ఎస్.విజయ్‌చంద్ర అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా 223 కేసులను రాజీద్వారా పరిష్కరించారు. అనంతరం జడ్జి విజయ్‌చంద్ర మాట్లాడుతూ.. రాజీ అవదగ్గ కేసులు లోక్ అదాలత్‌లలో పరిష్కరించుకోవడం ఉత్తమమని చూచించారు. కార్యక్రమంలో న్యాయవాదులు డి.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.



కొత్తవలస: లోక్ అదాలత్ నిర్వహిస్తున్న జూనియర్ సివిల్ జడ్జి విజయ్‌చంద్ర

సత్వర పరిష్కారం..

చీపురుపల్లి: లోక్ అదాలత్‌తో కేసులకు సత్వర పరిష్కారం లభిస్తుందని జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ పి. బుజ్జి అన్నారు. కోర్టు ఆవరణలో నిర్వహించిన లోక్ అదాలత్‌లో ఆయన మాట్లాడుతూ.. రాజీ ద్వారా కేసులను పరిష్కరించుకోవడం ఉత్తమమని చెప్పారు. ఈ సందర్భంగా పలు కేసులను రాజీ చేశారు.

మాతృభాషా పరిరక్షణలో సుపథ కృషి అభినందనీయం

- ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి

లక్కవరపుకోట: మాతృభాషా పరిరక్షణ.. సంస్కృతీ, సంప్రదాయ, మానవతా విలువల పరిరక్షణకు సుపథ స్వచ్ఛంద సంస్థ చేస్తున్న కృషి అభినందనీయమని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అన్నారు. మండల కేంద్రంలోని సుపథ ప్రాంగణంలో సంస్థ 22వ వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఒకటి నుంచి 5వ తరగతి విద్యార్థులకు పద్యపఠనం, శ్లోకపఠనం, గేయాలు, వ్యాసరచన, తదితర పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రస్తుత రోజుల్లో మన సంస్కృతీ, సంప్రదాయాలు నిర్వీర్యం అవుతున్న రోజుల్లో మాతృభాషా పరిరక్షణకు సుపథ చేస్తున్న కృషి మరవలేనిదన్నారు. సంస్థ వ్యవస్థాపకుడు యూవీఏఎస్ రాజు మాట్లాడుతూ.. సంస్కృతీ, సంప్రదాయాల పరిరక్షణకు మరింత కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి సీహెచ్.కూర్మారావు, సుపథ నిర్వాహకులు ఎ.శ్రీహరిశర్మ, జగద్గురు పీఠం కార్యదర్శి బీఆర్‌కే రాజు, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



పోటీ పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

రేపటి నుంచి గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు

వేపాడ: జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకం కింద గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేసే కార్యక్రమం ఈ నెల 15 నుంచి అక్టోబర్ 15 వరకు నిర్వహించనున్నట్లు వేపాడ పశువైద్యాధికారి గాయత్రి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నాలుగు నెలలు దాటిన పశువులన్నింటికీ టీకాలు తప్పకుండా వేయాలని సూచించారు. గాలికుంటు వ్యాధి సోకితే నోటి నుంచి తీగల మాదిరి చొంగ, నోటిలో పుండ్లు, కాలి గిట్టల మధ్య పుండు ఏర్పడతాయన్నారు.

జోరుగా పారిశుధ్య పనులు



కాలువలో మురుగు తొలగిస్తున్న కార్మికులు

గుర్ల: మండలంలోని తెట్టంగిలో సర్పంచ్ జమ్ము పార్వతి ఆధ్వర్యంలో శనివారం పారిశుధ్య పనులు చేపట్టారు. కాలువల్లో పూడికలు తొలగించారు. కాలువల్లో చెత్త,చెదారాలు వేయవద్దని ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి బి. గోవింద్ ప్రజలకు సూచించారు.